

'హంస' పురస్కారాల ప్రదానం


రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ ఆధ్వర్యంలో తెలుగు భాషాభివృద్ధికి విశిష్ట సేవలందిస్తున్న తొమ్మిది మంది ప్రముఖులను సన్మానించి, హంస పురస్కారాలను ప్రదానం చేశారు. 8లో



ఆలయ నిర్మాణానికి విరాళం

మలికిపురం: పెదతిప్ప శ్రీ వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయ పునర్ నిర్మాణానికి తిరుమల స్వామి పార్వతి దంపతులు మంగళవారం రూ.లక్ష విరాళం అందజేశారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 2,32,657 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.30 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు సంబంధించి తూర్పు డెల్టాకు 4,500, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

చండీమాత అలంకరణలో వనదుర్గమ్మ



చండీ మాత అలంకారంలో దర్శనమిచ్చిన వనదుర్గ అమ్మవారు

అన్నవరం: రత్నగిరి దుర్గామాత వనదుర్గ అమ్మవారి శ్రావణమాస జాతర మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం అమ్మవారిని చండీ మాతగా అలంకరించి పండితులు పూజలు నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం కుంకుమార్చన, చండీహోమం చేశారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు, ప్రసాదాలు నివేదించి, భక్తులకు పంపిణీ చేశారు. పూజా కార్యక్రమాల్లో వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠీ, యనమండ్ర శర్మ, ఉపాధ్యాయుల రమేష్, ముష్టి పురుషోత్తం, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, ప్రథమశ్రేణి వ్రతపురోహితులు నాగాభట్ల రవిశర్మ, పాలంకి పట్టాభి, అంగర సతీష్, ఆలయ అర్చకులు చిట్టెం వాసు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ



శిక్షణ ప్రారంభించిన సీనియర్ ఫ్యాకల్టీ శ్రీదేవి

సామర్లకోట: గ్రామాల్లో కొత్త లేఅవుట్ల ఏర్పాటుకు సంబంధించి నిబంధనల అమలుపై పంచాయతీ కార్యదర్శులకు పూర్తి స్థాయి అవగాహన ఉండాలని విస్తరణ శిక్షణ కేంద్రం సీనియర్ ఫ్యాకల్టీ శ్రీదేవి అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని గ్రేడ్-1, గ్రేడ్ 5 కార్యదర్శులకు ఆరు రోజుల పాటు నిర్వహించే రెసిడెన్సియల్ శిక్షణను ఈటీసీలో ఆమె మంగళవారం ప్రారంభించారు. శిక్షణ సమయంలో గ్రామ సచివాలయం, పంచాయతీలలోను సాధారణ పరిపాలనకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో కొత్త లేఅవుట్ ఏర్పాటు, పరిపాలన విధానం, హక్కులు, బాధ్యతలు, పంచాయతీ చట్టం, ఉపాధి హామీ పనులు, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, క్షేత్ర స్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, ఉద్యోగుల విధి నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీలు బి ఆంజనేయులు, నీహారిక శిక్షణ నిర్వహించారు.

అమలాపురం మీదుగా విజయవాడకు ఆర్టీసీ సర్వీసు

నేటి నుంచి సేవలు ప్రారంభం

కాకినాడ: కాకినాడ నుంచి అమలాపురం, రాజోలు, నర్సాపురం, మచిలీపట్నం ప్రాంతాల మీదుగా విజయవాడ వెళ్లేందుకు బుధవారం నుంచి ప్రత్యేక ఆల్ట్రా డీలక్స్ సర్వీసులు నడుపుతున్నట్టు కాకినాడ డిపో మేనేజర్ ఎంయుపీ మనోహర్ చెప్పారు. ఈ బస్సు కాకినాడలో ఉదయం 5 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు విజయవాడ చేరుకుంటుందన్నారు. తిరిగి మధ్యాహ్నం 3.30 గంటలకు విజయవాడలో బయలుదేరి రాత్రి 10.30 గంటలకు కాకినాడ చేరుకుంటుందని చెప్పారు. అలాగే విజయవాడ నుంచి గవర్నర్‌పేట డిపో ఆధ్వర్యంలో కాకినాడకు ఇదే రూట్‌లో మరో బస్సు కూడా ఏర్పాటు చేశారన్నారు. ఆ బస్సు విజయవాడలో ఉదయం 6.30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1.55 గంటలకు కాకినాడ చేరుతుందన్నారు. తిరిగి కాకినాడలో సాయంత్రం 4.45 గంటలకు బయలుదేరి రాత్రి 12.15 గంటలకు విజయవాడ చేరుతుందని చెప్పారు. ఈ బస్సుకు అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



కరుణించవా.. వరుణ దేవా..

- వర్షం కోసం మెట్టరైతుల నిరీక్షణ
- 15 వేల ఎకరాల్లో పడని వరినాట్లు
- 26 శాతం తక్కువ వర్షపాతం
- ప్రత్యామ్నాయ పంటలే ఆధారం



కోటనందూరు గ్రామంలో ఊడ్చిన పంట పొలాలు నీరు లేక బీటలు వారిన దృశ్యం

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): జిల్లాలో ఈ ఏడాది వరుణుడు ఆశించిన మేర కరుణించడం లేదు. రెండు మూడు నెలలుగా అనుకున్న రీతిలో వర్షాలు పడటం లేదు. మెట్ట ప్రాంత వ్యవసాయ పనులపై ఈ ప్రభావం కొంతమేర కనిపిస్తోంది. ముఖ్యంగా ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగుకు ఆటంకం ఏర్పడింది. జిల్లాలో ఈ ప్రాంతంలో ప్రధానంగా వర్షాధారంపై ఆధారపడి రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. ఈ సీజన్ ప్రారంభం నుంచి వర్షపాతం ఆశాజనకంగా లేదు. తొలకరి నుంచి ఇబ్బందులు ఎదురవుతూనే ఉన్నాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

మూడు నెలలూ ముఖం చాటేసిన వాన

ఈ ఏడాది జూన్ నెలలో కొద్దిపాటి జల్లులు మినహా ఇప్పటి వరకూ సరైన వర్షాలు లేవని మెట్ట రైతులు చెబుతున్నారు. మెట్ట ప్రాంతంలో ఇంకా 15 వేల ఎకరాల్లో వరినాట్లు వేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇందుకు అనుకూల వాతావరణ పరిస్థితులు లేవు. వరుణుడు కరుణిస్తే తప్ప వరినాట్లు పడే పరిస్థితి కనపించడం లేదు. తుని, కోటనందూరు, తొండంగి, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో జూన్ నుంచి ఈనెల వరకూ సాధారణంగా వర్షాలపై ఆధారపడుతుంటారు. కానీ ఈ మూడు నెలలూ వరుణుడు ముఖం చాటేస్తున్నాడు. సెప్టెంబరు కూడా ఆశాజనకంగా ఉండదనే సమాచారం కొంత వీరిని కలవరపెడుతోంది. మెట్టలో ఈ సారి వర్షాలు లేకపోవడంతో వరిసాగు కష్టమనే వ్యవసాయశాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. జూన్, జూలై అంత వర్షపాతం లేకపోయినా ఆగస్టులో అధికంగా వర్షాలు కురిసేవి. ఈ వర్షాలతోనైనా రైతులు వరినాట్లు వేసుకునేవారు. అందుకు భిన్నంగా ఈనెలలో కూడా చినుకు జాడ కనిపించడం లేదు. పైగా ఎండలు ఎక్కువగా ఉంటున్నాయి.దీంతో వరినారు ఎండిపోయే పరిస్థితికి వచ్చింది.

ఆందోళనకరంగా వర్షపాతం

జిల్లాలోని తుని, కోటనందూరు, రౌతులపూడి, తొండంగి, శంఖవరం గ్రామాల్లో ప్రస్తుతానికి 26 శాతం లోటు వర్షపాతం కనిపిస్తోంది. దీంతో ఆయా మండలాల్లో భూగర్భ జలాలు కూడా మరింత లోతుకు ఇంకుతున్నాయి. సాధారణ స్థాయిలో కూడా వర్షాలు కురవకపోతే ఆ ప్రభావం దిగుబడిపై కూడా ఉంటుందని ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తాండవ రిజర్వాయరుకు ఈనెల 15న నీరు విడుదల చేశారు. దీంతోతాండవ పరిధిలోని వరినారు పోసుకున్నారు. ప్రస్తుతం వరినారు సిద్ధమైన దమ్ములు చేసేందుకు నీటి ఎద్దడి ఎదురైంది. దీంతో రైతులు వరుణుడుపై భారం వేశారు. తుని, కోటనందూరు శివారు ప్రాంతాల్లో కొందరు రైతులు తాండవ నీటితో ఊడ్చినా నీరు సరిపడకపోవడంతో ఎండిపోతున్నాయి. మిగిలిన రైతులు వర్షం కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. సెప్టెంబర్ మొదటి వారం వరకూ ఖరీఫ్ సీజన్ ఉంటుంది. ఈ లోగా వరుణుడు కరుణిస్తే ఊడ్పులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని కోటనందూరుకు చెందిన వెంకటేశ్వరరావు చెప్పారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని రైతులకు వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈమేరకు వారు గ్రామాల్లో తిరుగుతూ అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ పంట పొలాలు దమ్ములు చేయలేదు. వర్షం వస్తే తప్ప దమ్ములు చేయలేని పరిస్థితి. ఇక నిరీక్షించి కాలం వృథా చేయకుండా వరికి బదులు మినుములు, పెసలు సాగు చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. రైతు భరోసా కేంద్రాల వారీగా వారికి అవగాహన కల్పిస్తున్నారు. అవసరమైన మినుములు, పెసలు, రాగులు అందుబాటులో ఉంచేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇక్కడి మండలాల్లో ఖరీఫ్‌లో సాధారణంగా వరి మాత్రమే సాగు చేస్తారు. రబీలో నీటి కొరత ఉంటుందని వరిసాగు చేయరు. కొంచెం ఆలస్యంగానైనా వర్షం కురిస్తే వరినాట్లు వేసేందుకే రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఐదు మండలాల్లో వర్షపాతం(మి. మీ)

మండలం	నెల	సాధారణ	కురిసింది
శంఖవరం	జూన్	111.3	49. 0
	జూలై	218	129
	ఆగస్టు	157.9	39.6
రౌతులపూడి	జూన్	111.3	79.8
	జులై	218 .6	187.4
	ఆగస్టు	157.9	47.1
తుని	జూన్	124	83.9
	జులై	197.2	182.9
	ఆగస్టు	170.0	87.0
తొండంగి	జూన్	116.2	102.4
	జులై	266.4	155.8
	ఆగస్టు	205.1	57.0
కోటనందూరు	జూన్	82. 6	50.1
	జులై	178.0	137.3
	ఆగస్టు	107.0	64.3

వరుణుడు కరుణిస్తేనే..



వరుణుడు కరుణిస్తే తప్ప ఈఏడాది పంటలు సాగుచేసే పరిస్థితి లేదు. గత మూడు సంవత్సరాలు నుంచి నీటికి ఇబ్బంది ఎదురు కాలేదు. కానీ ఏడాది దీనికి భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. వరుణుడు పూర్తిగా ముఖం చాటేశాడు. రెండు మూడు రోజుల్లో భారీ వర్షాలు పడితే తప్ప వరి సాగు చేయడం కష్టమే.

రామసూరి సత్యనారాయణ, రైతు, బొద్దవరం, కోటనందూరు మండలం

అవగాహన కల్పిస్తున్నాం



ఈ ఏడాది తుని సబ్‌డివిజన్ పరిధిలోని మండలాల్లో వర్షపాతం సాధారణ కంటే తక్కువగా ఉంది. అందుకే వరికి బదులు పెసలు, మినుములు, రాగులు వంటి సాగు చేసుకోవాలని రైతులకు సూచిస్తున్నాం. రైతులకు అవసరమైన అపరాలు కూడా అందుబాటులో ఉంచేందుకు సన్నాహాలు చేస్తున్నాం. అధిక వర్షపాతం నమోదు కాకపోతే రైతులు ఈ ఏడాది అపరాలు సాగుచేసుకోవడం మంచిది.

ఎన్ విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖాధికారి.

వర్సిటీ అభివృద్ధిలో డైరెక్టర్ల పాత్ర కీలకం



గ్రీన్ ఇనీషియేటివ్ డైరెక్టర్ మురళీకృష్ణను అభినందిస్తున్న వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే వర్సిటీ అభివృద్ధిలో డైరెక్టర్ల పాత్ర కీలకమని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. సమష్టి కృషితోనే విజయం సాధ్యమవుతుందన్నారు. గ్రీన్ ఇనీషియేటివ్, ఐఐఐపీఅండ్‌డీ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ మురళీకృష్ణను, అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటరెడ్డిని మంగళవారం ఆయన అభినందించారు.వీసీ ప్రసాదదరాజు మాట్లాడుతూ వర్సిటీ పచ్చదనం కోసం గ్రీన్ ఇనీషియేటివ్స్ డైరెక్టరేట్ తగిన ప్రణాళిక రూపొందించి సుందరీకరణగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. డీఏపీ విభాగం అకడమిక్ క్యాలెండర్,సిలబస్ రూపకల్పనలో పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఆర్అండ్‌డీ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.రవీంద్ర, అడ్మిషన్ డైరెక్టర్ ప్రసాద్, స్పోర్ట్స్ కౌన్సెల్ కార్యదర్శి డాక్టర్ శ్యామ్‌కుమార్, ప్రొఫెసర్లు చక్రవర్తి,హరిత,సుబ్బారావు పాల్గొన్నారు.

డయల్ యువర్ కలెక్టర్‌కు 13 సమస్యలు

కాకినాడ సిటీ: డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి ఫోన్ ద్వారా వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి 13 మంది సంక్షేమ పథకాల లబ్ధి, విద్య, ఉపాధి, భూసర్వే, భూ సమస్యలు వంటి వాటిపై టోల్‌ఫ్రీ నంబర్ 18004253077కు ఫోన్ చేసి తెలియజేశారు. వీరి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ కె శ్రీరమణి, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇర్రిపాకకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి



సీఎం రాక సందర్భంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలక్టర్ కృత్తికా శుక్లా,జిల్లా ఎస్పి సతీష్ కుమార్, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తదితరులు

ఎమ్మెల్యే ఇంట వివాహానికి హాజరు

జగ్గంపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం ఉదయం జగ్గంపేట మండలం ఇర్రిపాక రానున్నారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కుమార్తె పద్మశ్రీ అన్నపూర్ణ వివాహం కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. కలెక్టర్ కృత్తికా శుక్లా,జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఇక్కడ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం పర్యవేక్షించారు. ఇర్రిపాకలో ముఖ్యమంత్రి రాకకోసం హెలిప్యాడ్ ఏర్పాటు చేస్తున్నారు. తాడేపల్లి నుంచి నేరుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హెలికాప్టర్‌లో ఉదయం 11 గంటల ప్రాంతంలో ఇర్రిపాక చేరుకుంటారు. వధూవరులు పద్మశ్రీ అన్నపూర్ణ,సాయిఆదర్శ్‌లకు ఆశీస్సులు అందించనున్నారు. ఇక్కడ కార్యక్రమం ముగించుకుని తిరిగి తాడేపల్లి బయలుదేరి వెళ్లనున్నారు. ఈమేరకు ఆయన పర్యటనను అధికార వర్గాలు ధ్రువీకరించాయి.

పేదల ఇళ్ల నిర్మాణం వేగవంతం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీదిరి అప్పలరాజు



సమీక్ష నిర్వహిస్తున్న ఇన్‌ఛార్జి మంత్రి సీదిరి అప్పలరాజు చిత్రంలో ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తదితరులు

కాకినాడ సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో మూడున్నర ఏళ్లలో మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన జరుగుతున్నాయని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కాకినాడ రూరల్ నియోజకవర్గానికి సంబంధించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ఇన్‌ఛార్జి మంత్రి అధ్యక్షతన సమీక్ష జరిగింది. ఎంపీ వంగా గీత, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కి య, కాకినాడ రూరల్ శాసనసభ్యులు కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణలతో పాటు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యా రు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి స్థానికంగా ఉన్న సమస్యలపై ఇందులో చర్చించారు.

పేదలకు ఇళ్లకుపై శ్రద్ధ

మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో కాకినాడ గ్రామీణ నియోజకవర్గాన్ని ముందువరసలో నిలిపేందుకు అధికారులంతా సమష్టిగా పని చేయాలని సూచించారు. పేదల ఇళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వెచ్చించి భూసేకరణ చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం నెరవేరేలా ముఖ్యమంత్రి మార్గదర్శకాల ప్రకారం నియోజకవర్గాల సమీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు లేవనెత్తిన వివిధ అంశాలపై చర్చించి, స్మార్ట్‌గా పని చేసి సమస్యల పరిష్కారానికి ఈ సమీక్ష వేదికలు ఉపకరిన్నాయన్నారు. రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో భూ సేకరణ, లేఔట్ లెవెలింగ్, ఇంటి స్థలాల మంజూరు, బిల్లుల అప్‌లోడ్ వంటి అంశాలపై ప్రధానంగా అధికారులు దృష్టి సారించాలన్నారు. కరప మండలం తుల్యభాగ డ్రైన్‌పై తలపెట్టిన బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ శాశ్వత భవన నిర్మాణ పనులు, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనుల్లో పురోగతి చూపాలన్నా రు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న కొవ్వూరు, ఇంద్రపాలెం పరిధిలో తాగునీటికి సమస్య లేకుండా పబ్లిక్ కుళాయి కనెక్షన్లు ఏర్పా టు చేయాలన్నారు. రూరల్ నియోజకవర్గంలో ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సీపీవో పి త్రినాథ్, రూర ల్ నియోజకవర్గంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వార్షిక రుణ ప్రణాళిక అమలుకు కృషి



సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీ వంగా గీత

బ్యాంకర్లకు ఎంపీ గీత సూచన

కాకినాడ సిటీ: పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్న బ్యాంకులు వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలని ఎంపీ వంగా గీత సూచించారు. కలెక్టరేట్ వివేకానందహాల్‌లో లీడ్ జిల్లా కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా సలహా కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్ష కమిటీ (డీఎల్ఆర్‌సీ) సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు డీబీటీ విధానంలో అమలు చేస్తున్నందున తప్పనిసరిగా బ్యాంకు ఖాతా తెరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన వారికి స్పెషల్ డ్రైవ్ కింద క్రెడిట్ అవుట్ రీచ్ ద్వారా వచ్చే నెలలో రుణాల మంజూరు చేయాలన్నారు. ఇందుకు పటిష్ఠ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలన్నారు. వచ్చే నెల 17న కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ యోజనను ప్రారంభించనుందన్నారు. ఈ పథకం కింద 18 రకాల చేతివృత్తుల వారికి రుణాలు మంజూరు కానున్నాయన్నారు. నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను అందించనున్నట్లు ఎంపీ వివరించారు. జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ మాట్లాడుతూ జిల్లాలో 54 వేలకు పైగా సీసీఆర్‌సీ కార్డులు కౌలు రైతులకు అందించామన్నారు. వీటి ద్వారా ఇప్పటికే రూ.106 కోట్లు రుణాలు మంజూరైనట్లు తెలిపారు. సీసీఆర్‌సీ కార్డుదారులకు రుణాల మంజూరు చేయడంలో బ్యాంకర్లు చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ప్రత్యేక కేసీసీ (పశుసంవర్ధక, ఫిషరీష్) కార్డుదారులకు రుణాల మంజూరుకు సంబంధించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. జగనన్న పాల వెల్లువ, ఫిష్ ఆంధ్రా పథకాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించినందున రుణాల మంజూరును వేగవంతం చేయాలన్నారు. ఎల్‌డీపీవో పీఎం పూర్ణిమ, కన్వీనర్ కె సాయి మనోహర్, ఎల్‌డీఎం సీహెచ్ఎస్‌వీ ప్రసాద్, నాబార్డు డీడీఎం వై సోమునాయుడు, వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్యశాఖ అధికారులు ఎస్ విజయకుమార్, సూర్యప్రకాశరావు, పీవీ సత్యనారాయణ, జిల్లా చేనేత, జౌళి అధికారి కె పెద్దిరాజు, మెప్మా పీడీ బి ప్రియంవద, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

భావితరాలకు తెలుగు వారసత్వ సంపద

జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా



తెలుగు భాషాదినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు కవులను సత్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: తెలుగు భాష పరిరక్షణ, ప్రాచుర్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేసి ఘనమైన వారసత్వ సంపదగా భావితరాలకు అందించాలని కలెక్టర్ కృతికా శుక్లా కోరారు. వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు, విద్యావేత్త గిడుగు రామ్మూర్తి జయంతి పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్ కోర్టు హాలులో తెలుగు భాషా దినోత్సవాన్ని అధికారులు, సాహితీవేత్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై తెలుగు తల్లి, గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు మాట్లాడే వాడుక భాష గొప్పదనాన్ని చాటి చెప్పి, వ్యవహారిక భాషోద్యమం ద్వారా సమాజంలో సర్వజనావళికి సాహిత్య మాధుర్యాన్ని, విద్య, విజ్ఞానాలను చేరువలోకి తెచ్చిన మహనీయునిగా గిడుగు రామ్మూర్తిని కొనియాడారు. గిరిజనులు మాట్లాడే సవర భాషకు లిపి రూపొందించి సముద్ధరణకు గిడుగు ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన కృషి తెలుగు భాషా వికాసానికి, తెలుగు ప్రజలను ఏకోన్ముఖంగా నడిపించేందుకు దోహదం చేయాలని ఆకాంక్షించారు. ఎన్ని భాషలు, విద్యలు నేర్చినా మాతృభాష గొప్పదనాన్ని మరచిపోకూడదన్నారు. మధురమైన తెలుగు భాషను, సాహిత్యాన్ని పరిరక్షించి, పరిపుష్టం చేసి రానున్న తరాలకు అపురూప సంపదగా అందించాల్సిన బాధ్యత నేటి తరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలుగు భాషా వేడుకల్లో భాగంగా పద్య, వచన, గేయ, కథ, విమర్శ, అవధారణ, శతక, బాల సాహిత్య ప్రక్రియలలో విశేష సేవలు అందిస్తున్న తొమ్మిది మంది కవులను కలెక్టర్ సత్కరించారు. వారి భాషా సేవలను అభినందించారు. ప్రముఖ కవులు గొట్టిముక్కల వెంకటలక్ష్మి నరసింహాశాస్త్రి, టి విశ్వనాథరావు, మాకినీడి సూర్యభాస్కర్, అద్దేపల్లి ప్రభు, తంత్రవహి శ్రీరామమూర్తి, అద్దేపల్లి జ్యోతి, అంగర కృష్ణశ్రీ, కాకరపర్తి దుర్గాప్రసాద్, శ్రీపాద సూర్యప్రకాశరావులు ఈ సత్కారాన్ని అందుకున్నారు. డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, కాకినాడ ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ కె శ్రీరమణి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి డి నాగార్జున, సమాచార ఇంజనీర్ సి బాబూరావు, పీఆర్వోలు కె రవి, ఎస్ అజయ్, కలెక్టరేట్ సిబ్బంది, తెలుగు భాషాభిమానులు, సాహితీప్రియులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నవోదయ దరఖాస్తులకు రెండు రోజులే అవకాశం

రాయవరం: పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతిలో ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు త్వరపడాలి. మరో రెండు రోజుల్లో నవోదయ దరఖాస్తుల ప్రవేశానికి గడువు ముగియనుంది. ఇప్పటికే ప్రవేశ పరీక్ష గడువును రెండుసార్లు పెంచారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించడానికి ఈ నెల 31తో గడువు ముగియనుంది. దేశవ్యాప్తంగా తల్లిదండ్రుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నెల 31 వరకూ నవోదయ విద్యాలయ సమితి గడువు పెంచారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీఎస్://నవోదయ.జీవోవీ.ఇన్ లేదా హెచ్‌టీటీపీఎస్://సీబీఎస్ఈటీఎంఎస్.ఆర్‌సీఐఎల్.జీవోవీ.ఇన్/ఎన్‌వీఎస్ వెబ్‌సైట్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి ప్రాంత విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశముంది. ప్రవేశ పరీక్ష వచ్చే ఏడాది జనవరి 20న నిర్వహించనున్నామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

కాట్రేనికోన: పల్లంకుర్రు ప్రధాన పంట కాలువలో గుర్తు తెలియని 40–45 ఏళ్ల మధ్య వయసులో ఉన్న పురుషుడు మృతదేహం కనిపించగా స్వాధీనం చేసుకున్నామని కాట్రేనికోన ఎస్సై టి.శ్రీనివాస్ పేర్కొన్నారు. పల్లంకుర్రు వీఆర్‌ఓ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించారు. సుమారు 5 అడుగులు ఎత్తు గల పురుషుడు మృతదేహంపై తెలుపు, నీలం, ఎరుపు కలరు టీ షర్టు, ఖాకీ రంగు నిక్కరు ఉందన్నారు. జుట్టు, చర్మం ఊడి పోయిందన్నారు. మృతదేహం ఆచూకీ తెలిసినవారు కాట్రేనికోన ఎస్సై టి శ్రీనివాస్‌ను సంప్రదించాలన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తుని: తుని మండలం హంసవరం–అన్నవరం మధ్యలో రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై ఎస్.కె.అబ్దుల్ మారూఫ్ మంగళవారం తెలిపారు. తుని నుంచి అన్నవరం వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి 45 ఏళ్ల వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడి మెడలో ఏసుక్రీస్తు శిలువతో కూడిన పూసల దండ ఉందన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

సారా నిందితులకు ఆరు నెలల జైలు

బిక్కవోలు: సారా కలిగిన ఇద్దరు నిందితులకు ఆరు నెలల జైలు శిక్ష విధించినట్టు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బిక్కవోలుకు చెందిన అంబటి కొండయ్య, జి.మామిడాడ చెందిన కుడిపూడి కరుణకుమార్ సారా కలిగి ఉండడంతో వారిపై 2020లో కేసు నమోదు చేసినట్టు చెప్పారు. అనపర్తి జేఎఫ్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ పి.చైతన్య వారికి ఆరునెలలు జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

ఎన్టీఆర్, వైఎస్సార్‌లకు భారతరత్న ఇవ్వాలి

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- 'నన్నయ'లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన మంత్రి కారుమూరి, ఎంపీ భరత్‌రామ్, లక్ష్మీపార్వతి, జక్కంపూడి విజయలక్ష్మి, 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు తదితరులు

రాజానగరం: తెలుగు భాష అభ్యున్నతికి, తెలుగు రాష్ట్రాల ప్రగతికి అహర్నిశలూ కృషిచేసిన మహనీయులు ఎన్టీఆర్, వైఎస్సార్‌ల సేవలకు గుర్తింపుగా భారతరత్న ఇవ్వాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారులు వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని తెలుగు విభాగం, రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జయంతిని, తెలుగు భాష దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ తెలుగు జాతి ఖ్యాతిని ఎల్లలు దాటించిన మహానాయకుడు ఎన్టీఆర్ అయితే, తెలుగు రాష్ట్రాలు అభివృద్ధిలో ముందంజ వేసేలా కృషిచేసిన మహనీయుడు వైఎస్సార్ అన్నారు. ఈ కారణంగా ఉభయులకు 'భారతరత్న' ఇచ్చి, గౌరవించడం సముచితమని పేర్కొన్నారు. కన్నడా వాడైన శ్రీకృష్ణదేవరాయలు 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని తెలుగు ఔన్నత్యం గురించి ఏనాడో చెప్పారని గుర్తు చేశారు. తెలుగు మహాసభలలో ఆయన వేషం వేసే అవకాశం తనకు లభించడం మరచిపోలేని, మధురమైన సంఘటనగా జీవితంలో గుర్తుండిపోయిందన్నారు. తేనెలొలుకు భాష మన మాతృభాషను కాపాడుకుంటూ భావితరాలకు సురక్షితంగా, సుభిక్షంగా అందించవలసిన బాధ్యత మనందరి పైన ఉందని మంత్రి తెలిపారు. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలకు సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరమన్నారు. తెలుగు భాష, సాహిత్యం అభివృద్ధికి కృషి చేస్తున్న తెలుగు అకాడమీ, 'నన్నయ' వర్సిటీల సేవలను ప్రశంసించారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం జగన్

రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల విద్యను బోధిస్తూనే ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలుగు కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకున్నారన్నారు. భాష, సంస్కృత అకాడమీని ప్రత్యేకంగా ఏర్పాటుచేసి భాషాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. అకాడమీ ద్వారా పాఠ్యపుస్తకాలను ముద్రించి, సాహితీవేత్తలను ప్రోత్సహించడమే కాకుండా సకాలంలో విద్యార్థులకు అందజేస్తున్నామన్నారు. ప్రతి ఏటా ఉగాదికి, తెలుగు భాషా దినోత్సవం రోజు రెండు పర్యాయాలు అకాడమీ ద్వారా సామాజిక, సాహిత్య రచనలు, కవిత్వం, అవధానం, మాతృభాషాభివృద్ధికి సాంకేతిక కృషి చేసిన ఉత్తమ రచయితలకు అవార్డులను ప్రకటించి, అందజేస్తున్నామన్నారు. అవార్డుల ఎంపికను విమర్శలకు తావులేకుండా, నిష్పక్షపాతంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమిటీ ఆధ్వర్యంలో చేస్తున్నామన్నారు. **తెలుగు సాహిత్యంలో ప్రతిభావంతులైన కొత్తవారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో అవార్డుల ఎంపికలో వారికి ప్రాధాన్యం** ఇచ్చామన్నారు.

'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు మాట్లాడుతూ తెలుగు భాష గొప్పదనాన్ని వివరిస్తూ, దేశ విదేశాలలో తెలుగు భాషకు లభిస్తున్న గౌరవాన్ని, ప్రాధాన్యాన్ని వివరించారు. దేశంలోని వారసత్వ సంపదలతో తెలుగు భాష కూడా ఒకటంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలుగు భాష గొప్పదనాన్ని ప్రపంచానికి చాటే ప్రయత్నం చేశారన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడేవిధంగా 'నన్నయ' వర్సిటీ పనిచేస్తుందన్నారు. సాహితీవేత్త, సంఘ సేవకురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ నన్నయ వర్సిటీలో రాజరాజనరేంద్రుని పీఠం, జానపద పీఠం, తెలుగు భాష మ్యూజియం, నేదునూరి గంగాధరం సాహిత్య పీఠం ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రముఖ సాహితీవేత్త శలాక రఘునాథశర్మ, రిజిస్ట్రార్ ఆచార్య కె. సుధాకర్ ప్రసంగించారు.

'హంస' పురస్కారాల ప్రదానం

రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ ఆధ్వర్యంలో తెలుగు భాషాభివృద్ధికి విశిష్ట సేవలందిస్తున్న తొమ్మిది మంది ప్రముఖులను సన్మానించి, హంస పురస్కారాలను ప్రదానం చేశారు. వారిలో సాహిత్యంలో ఎస్.అబ్దుల్ అజీజ్ (రచయిత, కర్నూలు), మెడుగుల రవికృష్ణ (ఉపాధ్యాయుడు, గుంటూరు), డాక్టర్ జడా సుబ్బారావు (అసిస్టెంట్ ప్రొఫెసర్, నూజివీడు), వైహెచ్‌కె మోహనరావు (విలేకరి, పిడుగురాళ్ల), సామాజిక రచనలో ఎండపల్లి భారతి (రచయిత్రి, చిత్తూరు), కవిత్వంలో మాడభూషి సంపత్‌కుమార్ ఆచార్యులు (నెల్లూరు), అవధానంలో సూరం శ్రీనివాసులు (రిటైర్డ్ హెచ్‌ఎం, నెల్లూరు), సాంకేతిక రచనలు డాక్టర్ కేవీఎన్‌డీ వరప్రసాద్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, రాజమహేంద్రవరం) ఉన్నారు. వ్యాసరచన పోటీలలో గండికోట హిమశ్రీ (బుచ్చిరెడ్డిపాలెం, నెల్లూరు), జస్మితరెడ్డి (మంగళగిరి)లకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కూచిపూడి డిప్లమా విద్యార్థులు ఇచ్చిన నృత్య ప్రదర్శనలు విశేషంగా అలరించాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతిచెందిన కృష్ణ సూర్యభగవాన్ (ఫైల్)

యానాం: విశాఖ జిల్లా అనకాపల్లి సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో యానాంకు చెందిన యువకుడు మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సందర్భంగా కాకినాడ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పరామర్శించి వారి కుటుంబాలను ఓదార్చారు. మెరుగైన వైద్యాన్ని అందించాలని వైద్యులకు సూచించారు. ప్రమాదంపై కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం రాత్రి దరియాలతిప్పకు చెందిన గెద్దం సురేష్, రేవు పవన్‌కుమార్, ఎలిపే రాజ్‌కుమార్, దొమ్మేటిపేటకు చెందిన దొమ్మేటి కృష్ణసూర్యభగవాన్ పరంపేటకు చెందిన వేళంగి సాయికృష్ణ అయిదుగురు కారులో ఉప్పాడబీచ్‌కు వెళ్లి అక్కడ కొద్దిసేపు ఆగి అనంతరం అరకు ప్రాంతానికి వెళదామని అనుకుని అప్పటికప్పుడు బయలుదేరారు. అనకాపల్లి సమీపంలో హైవే ఫ్లైఓవర్ వద్ద సబ్బవరం వెళ్లే మలుపు ప్రాంతంలో అతివేగంగా కారు లారీని ఢీకొంది. దీంతో డ్రైవ్ చేస్తున్న దొమ్మేటి కృష్ణసూర్యభగవాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఎలిపే రాజ్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉంది.

రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు భేష్



రామేశ్వరంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్టు ఎరువును పరిశీలిస్తున్న ఢిల్లీ బృందం సభ్యులు

రామేశ్వరంలో ఢిల్లీ అధికారుల బృందం పర్యటన

పెదపూడి: రాష్ట్రం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు భేష్‌గా ఉన్నాయని ఢిల్లీ నుంచి వచ్చిన సెంట్రల్ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ బృందం సభ్యులు కితాబు ఇచ్చారు. రామేశ్వరంలో మంగళవారం ఢిల్లీ నుంచి వచ్చిన హెల్త్ అండ్ ఫ్యామిలీ, మినిస్టర్ ఆఫ్ హోమ్, మినిస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ విభాగాలకు చెందిన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆ బృంద సభ్యులు అనిల్‌కుమార్, ఆశీమా, అమిత్‌బోరా, మనీషా శాని, నాకుల్‌శర్మ, పవన్‌పాండే పలు పథకాలను స్టడీ చేశారు. ఈ సందర్భంగా వారు రైతు భరోసా కేంద్రం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల్లో నాడు–నేడు పనులు, జలజీవన్ మిషన్ పథకంలో నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంక్ వంటి పనులు పరిశీలించారు. ఆ పనులు ఏ విధంగా అమలు చేస్తున్నారు. ప్రజలకు ఎంత మేర ఉపయోగం ఉంటుంది, ఏ నిధులతో నిర్మాణాలు జరుగుతున్నాయి అనే పలు ప్రశ్నలను స్థానికులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ బృందం సభ్యులు గ్రామ సర్పంచ్ కొటికలపూడి చినబాబు గ్రామాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ప్రభుత్వ పథకాలు అన్ని సక్రమంగా అమలు చేస్తున్నారని కొనియాడారు. ఆయన్ని ఆదర్శంగా తీసుకుని గ్రామాలు అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం చినబాబును ఆ బృందం సభ్యులు శాలువా కప్పి సత్కరించారు. ఆ బృందం సభ్యులకు సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలువేసి అభినందించారు. ఈ బృందానికి సామర్లకోట ఈటీసీ ట్రైనింగ్ నుంచి నోడల్ అధికారిగా ఎంఎస్ఎన్ రెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మన్యం శ్రీనివాసు చౌదరి, ఆలయ కమిటీ చైర్మన్ గంగుమళ్ల సుబ్రహ్మణ్యం, పార్టీ గ్రామ కన్వీనర్ గాజుల మణికంఠ, కొటికలపూడి గోపి, నక్కా రాజు, వీరబాబు, కొటికలపూడి వెంకటరమణ, సచివాలయం కార్యదర్శి అచ్చిరాజు, పాల్గొన్నారు.

హోటల్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

రసాయన, ఆహార పదార్థాల నమూనాల సేకరణ



సేకరించిన ఆహార పదార్థాల నమూనాలకు సీలు వేస్తున్న అధికారులు

తుని రూరల్: మండలంలోని తేటగుంట శివారు 16వ నంబరు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న వైరా ఫ్యామిలీ రెస్టారెంట్‌లో కాకినాడ జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి కె.వి.సుబ్బారావు, సహాయ అధికారి బి.శ్రీనివాస్, తుని తహసీల్దార్ ఎల్.శివకుమార్ ఆధ్వర్యంలో బృందం వైరా హోటల్‌లో తనిఖీలు చేసింది. ఆహార పదార్థాలు, వంటగది, నిత్యావసర సరుకులు, డీప్ ఫ్రిజ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి బి.వి.సుబ్బారావు మాట్లాడుతూ హోటల్ వ్యాపారం నిర్వహణకు ప్రభుత్వం నుంచి అనుమతి (లైసెన్సు) పొందలేదన్నారు. ప్రమాదకర రంగులు (కెమికల్స్) వాడుతున్నారన్నారు. సర్వర్లు కనీస ప్రమాణాలు పాటించడం లేదన్నారు. డీప్ ఫ్రిజ్‌లో మాంస ఉత్పత్తులు అధికంగా ఉన్నాయన్నారు. వంటగదిలో మరింత పరిశుభ్రత పాటించాలని, ప్రమాదకర కెమికల్స్ వాడరాదని నిర్వాహకులకు సూచించారు. కారం, అనుమానిత ఆహార పదార్థాలలో నమూనాలు సేకరించామన్నారు. పరీక్షల నిమిత్తం పంపిస్తామన్నారు. పరీక్షల నివేదిక ఆధారంగా తహసీల్దార్ చర్యలు తీసుకుంటారన్నారు. జిల్లాలో హోటళ్లు, దాబాల్లో ఆహార పదార్థాలలో కల్తీకి పాల్పడితే కేసు నమోదు చేసి కఠిన చర్యలకు ఆదేశిస్తామని హెచ్చరించారు. తప్పనిసరిగా లైసెన్సులు పొందాలన్నారు. పరిశుభ్రత పాటించాలని, సర్వర్ల ఆరోగ్యంపై ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. వీఆర్‌ఓ వడ్డాది సత్యనారాయణ, కార్యదర్శి టీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌కు ఇద్దరి మృతి

- కూలి పనికి వెళ్లగా వెంటాడిన మృత్యువు
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులు





శ్రీను, మహేంద్రల మృతదేహాలు

తొండంగి: కూలిపనికోసం వెళ్లిన వారిద్దరూ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడంతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. తొండంగి మండలం ఏ.కొత్తపల్లికి చెందిన ఉరుకుట్టి శ్రీను(32), సీతారాంపురానికి చెందిన యువకుడు నంబారు మహేంద్ర(18) కొమ్మనాపల్లి శివారులో ఇంటి నిర్మాణం నిమిత్తం మంగళవారం కూలి పనికి వెళ్లారు. ఇంటి పక్కన ఉన్న విద్యుత్ స్తంభం వద్ద ఉరుకుట్టి శ్రీను మూత్రం పోసుకుంటుండగా విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. అతడు పడిపోవడంతో నంబారు మహేంద్ర పట్టుకోవడంతో అతడు కూడా విద్యుత్‌షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు ఏ.వి.నగరం పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే వారు ఇద్దరూ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడు శ్రీను దివ్యాంగుడు(మూగ)కి ఆరేళ్ల క్రితం వివాహం కాగా భార్య గంగ, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. భార్య గంగ నిండు గర్భిణి. దినసరి కూలీపనికి వెళ్లా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నంబారు మహేంద్రకు వివాహం కాలేదు. తండ్రి కేశవులు, తల్లి దుర్గ, అక్క మంగ, తమ్ముడు గంగ సతీష్ ఉన్నారు. ఇద్దరు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందడంతో రెండు కుటుంబాల వారు కన్నీరుమున్నీరుగా విలపించారు.

గిరిజన ప్రాంతాలలో ధర్మపథం

- రంపచోడవరంలో సత్యదేవుని వ్రతమాచరించిన 138 జంటలు
- వ్రతాల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధనలక్ష్మి



రంపచోడవరంలో సత్యదేవుని సామూహిక వ్రతాల కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి. పక్కన ఏసీ రమేష్‌బాబు

అన్నవరం: గిరిజన ప్రాంతాలలో హిందూ మత ధర్మ ఔన్నత్యాన్ని చాటి చెప్పేందుకు సత్యదేవుని ధర్మ ప్రచార రథంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలలో నిర్వహిస్తున్న ధర్మ ప్రచారానికి భక్తుల వద్ద నుంచి విశేష ఆదరణ లభిస్తోందని ఈఓ చంద్రశేఖర్ అజాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీన ఉదయం ఎనిమిది గంటలకు ఆయన జెండా ఊపి ప్రచార రథాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ రథం ద్వారా మొదట తూర్పుగోదావరి జిల్లా కోరుకొండలో సామూహిక వ్రతాలు నిర్వహించగా మంగళవారం రంపచోడవరంలోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో సామూహిక సత్యదేవుని వ్రతాలు నిర్వహించారు. ఈ వ్రతాల కార్యక్రమాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, అన్నవరం దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. తొలి బ్యాచ్‌లో 73 మంది భక్తులు, రెండో బ్యాచ్‌లో 75 మంది ఈ వ్రతాలాచరించారు. స్వామివారి వ్రతాలాచరించే భక్తులకు ఉచితంగా పూజాద్రవ్యాలు, స్వామివారి ప్రసాదం, రాగి మాడా అందజేశారు. సెప్టెంబర్ రెండో తేదీ వరకు మారేడుమిల్లి చుట్టుపక్కల ప్రాంతాలలో ధర్మ ప్రచారం నిర్వహించి మూడో తేదీన మారేడుమిల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సత్యదేవుని సామూహిక వ్రతాలు నిర్వహిస్తారు. అనంతరం చింతూరు, మోతిగూడెం, తదితర ప్రాంతాలలో ధర్మ ప్రచారం నిర్వహించి సామూహిక వ్రతాలు నిర్వహిస్తారు.

సెప్టెంబర్ 15 సామూహిక వ్రతాలు

ఆంధ్రప్రదేశ్ బోర్డర్‌కు సమీపంలోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని 'కుంట'లో సెప్టెంబర్ 15వ తేదీన సత్యదేవుని సామూహిక వ్రతాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కుంట, పరిసర ప్రాంతాలలో నివాసం ఉంటున్న తెలుగువారు ఏటా సత్యదేవుని ఆలయానికి విచ్చేసి స్వామివారి వ్రతాలాచరిస్తారని తెలిపారు. వారు చాలాకాలంగా కుంటలో సత్యదేవుని సామూహిక వ్రతాలు నిర్వహించాలని వారు కోరుతున్నారని తెలిపారు. అందువలన ఈ సారి అక్కడ సత్యదేవుని సామూహిక వ్రతాలు నిర్వహించాలని ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశించారని తెలిపారు.

కోవిడ్ మృతుడి కుటుంబానికి బీమా సొమ్ము చెల్లించాల్సిందే

వినియోగదారుల కమిషన్ తీర్పు

కాకినాడ లీగల్: కోవిడ్‌తో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి బీమా పరిహారం చెల్లించాల్సిందేనని వినియోగదారుల ఫోరం తీర్పు ఇచ్చింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడకి చెందిన ఓబిలిశెట్టి సత్యనారాయణ 2020లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి రూ.35.30 లక్షల అప్పు తీసుకున్నాడు. అప్పు తీసుకునే సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ద్వారా గ్రూప్ హెల్త్‌షీల్డ్ క్రెడిట్ యాక్సిడెంట్ మాస్టర్ పాలసీ (రూ.50లక్షల)కి ప్రీమియం సత్యనారాయణ వద్ద నుంచి కట్టించుకున్నారు. అయితే 2021లో సత్యనారాయణ కోవిడ్‌తో మరణించారు. ఇన్సూరెన్స్ కంపెనీ సత్యనారాయణ కుటుంబానికి బీమా పరిహారం చెల్లించలేదు. దీనిపై సత్యనారాయణ కుటుంబ సభ్యులు కాకినాడ వినియోగదారుల కమిషన్‌ను 2021లో ఆశ్రయించారు. కమిషన్ దీనిపై మంగళవారం తీర్పు ఇచ్చింది. కోవిడ్ మృతి సహజ మరణం కాదని, ప్రమాదవశాత్తూ సంభవించిన మరణమని కమిషన్ తీర్పులో పేర్కొంది. దాని ప్రకారం సత్యనారాయణ కుటుంబ సభ్యులకు రూ.50లక్షలను, 9శాతం వడ్డీతో పాటు ఖర్చులుగా రూ.10వేలు ఇన్సూరెన్స్ కంపెనీ ఇవ్వాలని కాకినాడ వినియోగదారుల కమిషన్ తీర్పు ఇచ్చింది. అధ్యక్షుడు చెరుకూరి రఘుపతి వసంత్‌కుమార్, సభ్యులు చెక్కా సుశీ, చాగంటి నాగేశ్వరరావు ఈ తీర్పు చెప్పారు.